మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించి..

• 'స్ఫూర్తి'గా నిలుస్తున్న స్ఫూర్తి



మల్కాజిగిరి: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మల్కాజిగిరి సఫిల్‌గూడకు చెందిన అప్పల స్ఫూర్తి నిరూపించారు. 2018లో ఉస్మానియాలో ఇంజినీరింగ్‌ అనంతరం ఎంబీఏ చేసిన ఆమె పూణేలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగిగా పనిచేసి రాజీనామా చేశారు. ఎలాంటి కోచింగ్‌ లేకుండా ఇంటి వద్దే ఉంటూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసి ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించడమే కాకుండా గ్రూప్‌- 1 ప్రిలిమ్స్‌కు క్వాలిఫై కావడంతో మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్నారు. పబ్లిక్‌ హెల్త్‌ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా, పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించిన ఏఈ, గ్రూప్‌ -4 కు ఎంపికయ్యారు.

నేడు అమ్మవారికి బోనాలు



గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ జయగిరి లక్ష్మీనర్సింహస్వామినగర్‌లోని మహంకాళి, పోచమ్మతల్లి అమ్మవారి బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. జంట నగరాల్లో జరిగిన జాతర అనంతరం అత్యంత వైభవంగా బోనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తుల తాకిడితో పాటు సికింద్రాబాద్‌, మారేడ్‌పల్లి, తుకారాంగేట్‌, మల్కాజిగిరి, గౌతంనగర్‌, మహేంద్రహిల్స్‌, ఇతర ప్రాంతాల నుంచి జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని ఆలయ కమిటీ నిర్వాహకులు సాధువు, పరమేష్‌, సత్యనారాయణ, పాండురంగన్‌లు ప్రకటించారు.

పార్కు అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

మౌలాలి : మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మౌలాలి డివిజన్‌లోని ఎంజే కాలనీ సభ్యులు క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఎంజే కాలనీలోని పార్కుల్లో కమిటీ హాల్‌ నిర్మించాలని కోరారు. కాలనీ సభ్యులు బైద్యనాథ్‌సింగ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, సూర్యం, శ్రీనివాస్‌, అమర్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో 'గీత'

కాప్రా : సాకేత్‌ కాలనీలోని ఓర్ల కన్వెన్షన్‌లో గీత అంతర్జాతీయ 9వ డిస్ట్రిక్‌ క్యాబినెట్‌ 320సి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. లయన్స్‌ క్లబ్‌ ద్వారా నిర్వహించే ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ స్కూళ్లకు వస్తువులను విరాళంగా అందించనున్నట్లు మాజీ కార్పొరేటర్‌ లయన్‌ పజ్జూరి పావనీరెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు రిజిస్ట్రేషన్‌, 4 గంటలకు రిజిస్ట్రేషన్‌ చేసుకున్న వారిని లక్కీడిప్‌ ద్వారా ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలువురి ఉపన్యాసాలు ఉంటాయని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



రామంతాపూర్‌ : ఉప్పల్‌ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం కావ్యాంజలి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ డాన్స్‌ గురువు కుమారి కావ్య శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. మూషిక వాహన హరిహర గజముఖ లింగాష్టకం దశావతార శబ్దం మొదలైన అంశాలపై నాట్య ప్రదర్శనతో మెప్పించారు.

క్రికెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



బోడుప్పల్‌ : హెచ్‌సీఏయూ 16 ఇంటర్‌ స్కూల్‌, కాలేజీ క్రికెట్‌ టోర్నమెంట్‌లో బోడుప్పల్‌ కిరణ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ విద్యార్థులు సత్తా చాటారు. కరీంగూడలో జరిగిన హెచ్‌సీఏ మ్యాచ్‌లో విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు రితేష్‌ ఈ సందర్భంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. కెప్టెన్‌ ధ్రువ 53 బంతుల్లో 48 పరుగులతో నాటౌట్‌గా నిలవగా. ప్రియం ఆచార్య 4.1 ఓవర్లలో 17 పరుగులు, బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసినట్లు తెలిపారు. అభిరామ్‌ నుజ్జుల 4 ఓవర్లలో 9 పరుగులతోపాటు మూడు వికెట్లు తీశాడు. విద్యార్థులను చదువుతోపాటు అన్ని రకాల క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌

మౌలాలి : దీన్‌దయాల్‌నగర్‌లోని సంతోషిమాత గుడి వెనకాల ఉన్న నాలాను మౌలాలి కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌ శనివారం పరిశీలించారు. రూ. 6 లక్షలతో గుడి కింద ఉన్న పూడికను తీసే క్రమంలో గుడి వెనకాల కూడా తీయాలని కార్పొరేటర్‌ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు అధికారులను ఆదేశించారు. కాలనీ అధ్యక్షుడు శ్రావణ్‌, వాసుదేవరావు, మల్కాజిగిరి సీనియర్‌ నాయకుడు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్‌, జనరల్‌ సెక్రటరీ వెంకటేష్‌ నేత పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీల నిలిపివేత



దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో..

రామంతాపూర్‌ : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అమానవీయమైన ఘటనను ఖండిస్తూ ఉప్పల్‌ సర్కిల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆసుపత్రుల్లోని వైద్యులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఉప్పల్‌, రామంతాపూర్‌, హబ్సిగూడ, చిలుకానగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీ దవాఖానాల్లో వైద్యులు విధులు బహిష్కరించారు.

- కాకతీయ హైస్కూల్‌ విద్యార్థులు పలు వీధుల గుండా నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితుడితో పాటు అతడికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్‌ రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌ : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఈఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు చీమా శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రి నిరసన చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్‌ రమేష్‌, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రతినిధులు రవి, విజయ్‌, సీనియర్‌ వైద్యులు, గీత, వెంకటేష్‌బాబు, ఆర్‌ఎంవో శ్వేత, సిస్టర్‌ విక్టోరియా వైద్యులు, నర్సింగ్‌ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎల్‌కే ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు సుభాష్‌ గట్టు, అబేద్‌ అలీ, పవన్‌ మహాత్మ, దినేష్‌, నూతన్‌, ప్రేమ్‌కుంజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కాప్రా : శ్రీరాంనగర్‌ కాలనీలోని అశోక రిహాబిలేషన్‌, చిల్డ్రన్స్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. డాక్టర్లు సవిత, కిరణ్‌, సచిన్‌ తదితరులు పాల్గొన్నారు.

- జూనియర్‌ డాక్టర్ల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. జూనియర్‌ డాక్టర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో విద్యార్థులు



ధర్నా చేస్తున్న ఈఎస్‌ఐ వైద్యులు



రామంతాపూర్‌ మెడికల్‌ కళాశాలలో..



మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో..



కాప్రాలో నిరసన ర్యాలీలో వైద్యులు



ఉప్పల్‌ రింగ్‌ రోడ్డు వద్ద..



నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి

శ్రీవారి కల్యాణ మహోత్సవం



దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి హనుమత్‌సేవ(రథోత్సవము) ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి , కార్పొరేటర్లు శ్రవణ్‌, రాజ్యలక్ష్మి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సుదర్శనహోమం, పుష్పయాగం, డోలోత్సవం, దర్బార్‌ సేవ జరుగుతుందని ఈవో రవీందర్‌రెడ్డి, అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కాప్రా జెడ్పీ స్కూల్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. స్కూల్‌ ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కాసేపు విద్యార్థులతో ముచ్చటించి, స్కూల్‌ ఆవరణలో నిర్వహించిన పేరెంట్స్‌, టీచర్స్‌ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు బాపురాజ గోపాలం, బాబియానాయక్‌, శ్రీనివాస్‌చారి, బీఆర్‌ఎస్‌ నేతలు బైరి నవీన్‌గౌడ్‌, ఇంద్రయ్య, మైసయ్య, భాస్కర్‌గౌడ్‌, కొప్పుల కుమార్‌, శ్రీకాంత్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యటన

అల్వాల్‌ : అల్వాల్‌ సర్కిల్‌ పరిధిలో శుక్రవారం కురిసిన వర్షానికి ఫాదర్‌ బాలయ్యనగర్‌, రిట్రీట్‌ కాలనీ, తిరుమల ఎన్‌క్లేవ్‌, జ్యోతినగర్‌ ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్‌ ఎస్‌ఈ చిన్నారెడ్డి, అల్వాల్‌ సర్కిల్‌ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వరద ఉధృతికి గల కారణాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. కాలనీల్లో తక్కువ సమయంలో ఎక్కువ శాతం వర్షపాతం నమోదు కావడంతో కాలనీల్లో నీరు చేరిందన్నారు. అల్వాల్‌ సర్కిల్‌ ఈఈ శ్రీశాంతి, డీఈ రఘు, ఏఈ లక్ష్మి, రవళి తదితరులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు

పేదలకు అండగా కల్యాణలక్ష్మి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌ సర్కిల్‌ పరిధిలోని 52 మంది కల్యాలక్ష్మి, షాదీముబారక్‌ లబ్ధిదారులకు తహసీల్దార్‌ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో ఎంతో మంది పేదలకు ఆపదలో ఉన్నప్పుడు ఆర్థికంగా ఈ పథకం భరోసా కల్పించిందని, ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో దీనికి తోడుగా తులం బంగారం ఇస్తానని వాగ్దానం చేశారన్నారు. ఈ చెక్కులతో సహా తులం బంగారం కూడా అందచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్‌ రాములు, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్‌కిషోర్‌, డిప్యూటీ తహసీల్దార్‌ సుధాకర్‌, నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్‌, ఢిల్లీ పరమేష్‌, మల్లేష్‌గౌడ్‌, శోభన్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్‌, సతీష్‌, వెంకటేష్‌యాదవ్‌, చరణ్‌, గిరి, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తాం



పార్కును ప్రారంభించిన కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు. శుక్రవారం మారుతీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్‌ పార్కును ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కమ్యూనిటీహాల్స్‌, పార్కుల నిర్మాణానికి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు కూడా సహకరించాలన్నారు. మారుతీనగర్‌లో పార్కు నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడిన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి



అల్వాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్‌: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులకు నిరసనగా అల్వాల్‌ సర్కిల్‌ బీజేపీ నేతలు శనివారం తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అల్వాల్‌ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని, రక్షణ కోసం భారత్‌ను కోరుకుంటున్నారన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ కో-కన్వీనర్‌ మల్లికార్జున్‌గౌడ్‌, అజయ్‌రెడ్డి, రవికిరణ్‌, ఆంథోని, కృష్ణారెడ్డి, సంతోష్‌గౌడ్‌, శేఖర్‌, లక్ష్మణ్‌, వినయ్‌, భాస్కర్‌, భోగ విష్ణుమూర్తి, కరుణ, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలకు చెందిన సుమారు 750మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాపోలు వెంకటేశ్వర్లు, రాపోలు సుదర్శన్‌, స్వాతిలు సుమారుగా రూ. 3 లక్షల విలువైన షూస్‌, టై, బెల్టులను మాజీ మేయర్‌ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్‌ కొల్తూరి మహేష్‌ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. పాఠశాలలో అవసరమైతే విద్యావాలంటీర్ల ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దాతలను పలువురు అభినందించారు. నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, జావీద్‌ఖాన్‌, రఘువర్ధన్‌రెడ్డి, మనోరంజన్‌రెడ్డి, నిర్మల, జిలాని పాషా, శంకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు వెళ్లొచ్చేసరికి..

రూ.25లక్షల విలువైన బంగారం రూ.లక్ష నగదు చోరీ

మేడిపల్లి: సమీప బంధువుల దహన సంస్కారాలకు వెళ్లొచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిఉన్న సుమారు రూ.25లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌ ద్వారకానగర్‌ ఫేజ్‌-2లో నివసించే సి.సంతోష్‌ ప్రైవేట్‌ ఉద్యోగి. ఈనెల 13న తన మామ దహన సంస్కారాలకు ఊరెళ్లి తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూశారు. బీరువాలో ఉన్న 40 తులాల బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఉప్పల్‌ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకులకు తీవ్రగాయలైన ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్‌ జిల్లాకు చెందిన గుజ్జల రాజు (24) విద్యార్థి, విశ్వతేజ్ఞ (17) స్నేహితులు. హబ్సిగూడలో రాత్రి భోజనం ముగించుకుని బైక్‌పై (టీఎస్‌33 హెచ్‌2231) ఉప్పల్‌ స్టేడియం సమీపంలో ఏక్‌మీనార్‌ వద్ద యూటర్న్‌ తీసుకుంటుండగా (టీఎస్‌08కెఎఫ్‌0111) కారు ఉప్పల్‌ నుంచి సికింద్రాబాద్‌కు అతి వేగంగా బైక్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు కిందపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను యశోద ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్‌

మల్లాపూర్‌ : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను నాచారం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం పోలీసులు నాచారం బాబా ప్యాలెస్‌ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. మల్లాపూర్‌కు చెందిన కోల్లా రాధేశ్యామ్‌ మణికంఠ (19) మల్లాపూర్‌ అన్నపూర్ణ కాలనీకి చెందిన లొంక హరీష్‌(20) ఇద్దరు స్నేహితులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారి బైక్‌ను తనిఖీ చేయగా.. 90 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. గంజాయిని విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సాల్వ్‌ ఫర్‌ టుమారో టాప్‌-20లో సిటీకి చోటు

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్‌ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్‌)లో భాగంగా సామాజిక అంశాలపై కృషి చేసే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించేందుకు శామ్‌సంగ్‌ ఇండియా నిర్వహిస్తున్న సాల్వ్‌ ఫర్‌ టుమారో పోటీ ఫలితాల్లో నగరానికి చోటు దక్కింది. ఈ జాతీయ స్థాయి పోటీకి సంబంధించి షార్ట్‌ లిస్ట్‌ చేసిన టాప్‌-20 టీమ్స్‌లో నగరానికి చెందిన టీమ్‌ ఉందని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. సెమీ ఫైనలిస్ట్స్‌లో మొత్తం 51 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్న టీమ్స్‌లో నగరానికి చెందిన టీమ్‌ సహ్లామ్‌ కూడా ఉందని తెలియజేశారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి





బోడుప్పల్‌ : విద్యార్థులు సోదరభావంతో మెలగాలని జేజీఆర్‌ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్‌ గంగరాజు అన్నారు. బృందావన్‌ కాలనీలోని జేజీఆర్‌ ఉన్నత పాఠశాలలో శనివారం రక్షాబంధన్‌ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మా ట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్‌ నిలుస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌ : చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎల్‌కేజీ, యూకేజీ, 9, 10వ తరగతి విద్యార్థి సందర్శించి ఇన్‌స్పెక్టర్‌ గోవింద్‌రెడ్డితో మాట్లాడారు. పోలీసులు నిర్వహించే విధులను అడిగి తెలుసుకున్నారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఇన్‌స్పెక్టర్‌ గోవింద్‌రెడ్డి, ఎస్సైలకు విద్యార్థులు రాఖీలు కట్టారు. ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి, సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి, చెడులను తెలుసుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి రామారావు, ఉపాధ్యాయులు భవాని, శేఖర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

విదేశీ మద్యం స్వాధీనం..

ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల అరెస్ట్‌

మల్కాజిగిరి : వివిధ రాష్ట్రాలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా విదేశీ మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను మల్కాజిగిరి ఎక్సైజ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. జిల్లా ప్రొబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ అధికారి నవీన్‌కుమార్‌, అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరిండెంట్‌ ముకుందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి సఫిల్‌గూడ వద్ద ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తన సహ ఉద్యోగి ఈసీఐఎల్‌ సాకేత్‌ వద్ద ఉన్న శ్రీ యుగ ఎన్‌క్లేవ్‌కు చెందిన కందాడి రఘునాథరెడ్డి (50) దగ్గర కొనుగోలు చేశానని చెప్పాడు. అతడి ఇంటిపై దాడి చేయగా.. ఇతర రాష్ట్రాలతో పాటు సుంకం చెల్లించని విదేశీ మద్యం బాటిళ్లు 100 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటు మద్యం కొనుగోలు చేసిన అతడి సహ ఉద్యోగి నల్లకుంటకు చెందిన సడిమెల హరిక్రిష్ణ (46)ను అరెస్ట్‌ చేశామని పోలీసులు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.